క్లుప్తంగా

వేలంతో ఆలయానికి ఆదాయం

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఏడాదిపాటు వర్తకులు వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఆలయ కమిటీ చైర్మన్ నరసారెడ్డి, ఈఓ రామాంజినేయులు ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. కూల్ డ్రింక్స్, చిల్లర అంగడికి రూ.2.50 లక్షలు, బొమ్మలు, దారాల విక్రయాలకు రూ.1,95,000, గాజులు విక్రయించుకునేందుకు రూ.63 వేలకు, ఐస్‌క్రీమ్ విక్రయించేందుకు రూ.86 వేలకు వేలం ఖరారైంది.

నేడు సమావేశం

గాండ్లపెంట: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మండలంలోని 7 గ్రామ సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప గురువారం తెలిపారు.

అక్రమంగా వేసిన రోడ్డు తొలగింపు



రోడ్డును జేసీబీతో తొలగింపజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్టతండా వద్ద బైపాస్ రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వ భూమిలో రియల్టర్లు వేసిన అక్రమ రోడ్డును అధికారులు తొలగించారు. 'కోట్ల స్థలాన్ని కొట్టేశారు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 2న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఆర్‌ఐ మున్వర్, వీఆర్ ఇంతియాజ్ జేసీబీతో వెళ్లి అక్రమ రోడ్డును తొలగింపజేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్సు అప్పగింత

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరచిపోయిన పర్సును కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనోద్దీన్ సొంతదారుడికి అప్పగించారు. ఆళ్లగడ్డకు చెందిన భాస్కర్ గురువారం అనంతపురం నుంచి ముదిగుబ్బకు పలమనేరు డిపో బస్సులో వచ్చాడు. దిగే సమయంలో పర్సు బస్సులో పడిపోయింది. బస్సు వెళ్లిపోయిన తర్వాత చూసుకోగా పర్సు కనిపించలేదు. పర్సులో రూ. 6,160 నగదు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నాయి. భాస్కర్ ఈ విషయాన్ని కదిరి ఆర్టీసీ డిపోలో విచారణా కేంద్రంలో పనిచేసే నాగార్జునకు తెలియజేశాడు. బస్సు కదిరికి రాగానే సోదా చేయగా పర్సు లభ్యమైంది. దానిని డీఎంకు అప్పగించాడు. భాస్కర్‌ను పిలిపించి పర్సును అందజేశారు.

నేడు గృహ సారథులతో సమావేశం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మున్సిపాలిటీ పరిధిలో కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ కన్వీనర్ రంగారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

ప్రతి గ్రామంపై నిఘా ఉంచాలి



సూచనలిస్తున్న డీఎస్పీ భవ్యశ్రీ కిశోర్

తలుపుల: నేరాల నివారణకు ప్రతి గ్రామంపై నిఘా పెట్టాలని కదిరి డీఎస్పీ భవ్యశ్రీ కిశోర్ ఎస్‌ఐ మగ్బుల్ బాషాకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. క్రైం రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యాక్షన్, మట్కా, గాంబ్లింగ్ జరగకుండా చూడాలని సూచించారు. శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. రూరల్‌సీఐ శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



దివ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు న్యామద్దల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.దివ్య ఎంపికైనట్లు పాఠశాల పీడీ కుమార్ రాజు తెలిపారు. జనవరి 28, 29, 30 తేదీల్లో నంద్యాలలో జరిగిన త్రోబాల్ అండర్ – 19 విభాగంలో అనంతపురం జిల్లా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన దివ్య పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. దీంతో ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థిని దివ్యను హెచ్‌ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్, రాజశేఖర్, రామమోహన్ గురువారం అభినందించారు.

కష్టాలు తొలగి..సంతోషాల వెల్లువ

- మళ్లీ గెలిచేది జగనన్నే
- ఎమ్మెల్యే సిద్దారెడ్డి వద్ద సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు



పథకాలు వివరించేందుకు ఇంటి వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డితో మాట్లాడుతున్న మరియమ్మ

కదిరి: ''నా బిడ్డ జగన్ అంటే నాలాంటి ముసిలోళ్లందరికీ ఎంతో ఇష్టం..అభిమానం. ఆ బిడ్డ జనానికి ఎంతో మంచి చేస్తుంటే టీడీపీ వాళ్లు నోటికొచ్చింది మాట్లాడుతున్నారు. జనమంతా జగన్ వెంట ఉంటే వాళ్లు మాత్రం జనంకు దూరంగా ఉంటూ విమర్శలు జేస్తున్నారు. ఎవ్వరెన్ని జెప్పినా మళ్లా గెలిచేది జగనే..సీఎం అయ్యేది ఆయనే'' అని మరియమ్మ అనే మహిళ కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డితో అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి గురువారం పట్టణంలోని 4వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. జగనన్న పాలనతో సంతోషంగా ఉన్నామని, మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం కావాలని పలువురు ఎమ్మెల్యేతో అన్నారు. గతంలో ఇల్లు కావాలన్నా..రేషన్ కార్డు కావాలన్నా..పింఛన్ కావాలన్నా టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న పాలనలో ఆ కష్టాలు తొలగిపోయాయని కొందరు ఎమ్మెల్యేతో పేర్కొంటూ సంతోషాన్ని వెలిబుచ్చారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రోడ్లు, కాలువల నిర్మాణం తదితర సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం సమూలమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. వైద్య సేవలను ప్రజల వద్దకు తీసుకెళ్లిందన్నారు. అవ్వా, తాతలకు ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటే..అని తెలియజేశారు. జగనన్న ప్రజారంజక పాలన అందిస్తుంటే ఎల్లో మీడియా చంద్రబాబుకు బాకా ఊదుతూ కథనాలు రాయడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, సైకిల్ పార్టీకి మళ్లీ ఓటుతోనే బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. 4వ వార్డు కౌన్సిలర్ కృపాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు భూమి పూజ: 4వ వార్డులో రూ.8 లక్షలతో రోడ్లు, కాలవల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు కోర్టుకెళ్లి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

పుట్టపర్తి సమగ్రాభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తిటౌన్: పుట్టపర్తి పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నగర పంచాయతీని గ్రేడ్ –2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, నాయకులు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా ఉన్న పుట్టపర్తి 2011లో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిందన్నారు. గ్రేడ్ –2 మున్సిపాలిటీగా ఏర్పడితే అన్నివిధాల అభివృద్ధి చెందుతుందని భావించి ప్రతిపాదనలు సిద్ధం చేసి కౌన్సిల్ తీర్మానం చేసి మున్సిపల్ మంత్రిత్వశాఖకు పంపడంతో గ్రేడ్–2 మున్సిపాలిటీగా ఉత్తర్వులు వెలువడడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి బాబా ఆశీస్సులు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పుట్టపర్తిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఏఈ స్వాతి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువుభాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు కేశప్ప, నరసింహులు, రఘునాథరెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు జగనన్న సైన్యంలా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జగనన్న సైన్యంలా పని చేసి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని మరోమారు అధికారంలోకి తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ధనియానిచెరువు పంచాయతీ కేంద్రంలోని సచివాలయ ఆవరణలో గురువారం ఎంపీపీ ఈటిరాము అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు, వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా సిఫార్సు పొందినవారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జగనన్న పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటివద్దకే చేరుతున్నాయన్నారు. పేదరికం లేని సమాజం నిర్మిస్తున్న జగనన్న ప్రభుత్వంపై పచ్చ మీడియా బురద జల్లుతోందని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలు, వంచనలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సర్పంచ్ దిల్షాద్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నాగభూషణం, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీలు కొత్తరంగారెడ్డి, తిమ్మారెడ్డి, ఆసం లక్ష్మిదేవి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు రాధా, సరిత, రామాంజులరెడ్డి, నాగమునీశ్వరనాయుడు, విష్ణుమూర్తి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ రాఘవయ్య, ఉపసర్పంచులు భాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ, సామిరెడ్డి పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ

- 4న ప్రత్యేక పూజలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్టలో నున్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.3 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు జయశ్రీ, ఉపాధ్యక్షుడు పుట్లూరు నరసింహులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 4న చేపట్టే పూజా కార్యక్రమాలపై పట్టణంలో గురువారం కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. గర్భగుడి, ఆలయ శిఖరం నిర్మాణానికి దాతలు రూ.60 లక్షల విరాళం ఇస్తున్నారని తెలిపారు. 4న ఉదయం 7గంటలకు శ్రీ మహా గణపతి పూజ, హోమాలతోపాటు లక్ష్మీనరసింహస్వామి మాలమంత్ర, బాలాలయ ప్రవేశ శాంతి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ స్వామివారి మూలవిరాట్‌ను ప్రధాన కలశ, ఉత్సవ మూర్తుల బాలాలయ ప్రవేశం జరుగుతుందని తెలిపారు. కొండపైన ఉన్న స్వామి విగ్రహాన్ని కింద నున్న మండపంలో కొలువుదీరుస్తామన్నారు. నూతన ఆలయం నిర్మాణం అనంతరం స్వామిని కొలువుదీరుస్తామని తెలిపారు. ఆలయంతోపాటు కల్యాణ మండపం, భక్తుల తలనీలాల కోసం కళ్యాణ కట్ట, గరుత్మంతుని విగ్రహం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. భక్తులు, ధన, వస్తు రూపేణ విరాళాలు అందించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కమిటీ కార్యదర్శి గంజికుంట బాలగంగాధర్, కోశాధికారి కలవల మురళీధర్, డైరెక్టర్లు అజంతా కృష్ణ, జయప్రకాష్ పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి వినతి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎండీ ఇస్మాయిల్

కదిరి అర్బన్: విజయవాడలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్రస్థాయి మైనార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మైనార్టీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాకు కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, పట్టణాధ్యక్షుడు కేఎస్ బాహుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా వినతిపత్రం సమర్పించారు. మసీదులు, మదరసాల అభివృద్ధి, ముస్లింల విద్యా, ఉద్యోగం, ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలను అందులో పేర్కొన్నారు. కేంద్ర ఓబీసీ కోటా 27 శాతం రిజర్వేషన్లలో ముస్లింలకు కూడా వాటా కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

20లోపు ఈ క్రాప్ పూర్తి చేయండి



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

తలుపుల: ఓబులరెడ్డిపల్లి, వేపమానిపేట గ్రామాల్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలను వ్యవసాయశాఖ ఏడీఏ సత్యనారాయణ గురువారం సందర్శించారు. వరిలో చీడపీడల నివారణకు, మొక్కజొన్న సాగులో అధిక దిగుబడుల సాధనకు రైతులకు సూచనలు ఇచ్చారు. వేపమానిపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పంటల సాగు వివరాలు నమోదు చేయాలని సూచించారు. రబీలో సాగైన పంటలకు ఈనెల 20లోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని, పీఎం కిసాన్ ఈకేవైసీని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. ఏఓ షాదాబ్, ఏఈఓ రహంతుల్లా, వీఆర్‌ఓ రామచంద్ర పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

తలుపుల: స్థానిక సహకార పరపతి సంఘంలో పంట రుణాలు పొందిన రైతులు ఈఏడాది మార్చిలోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పూల శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జి సీఈఓ చంద్ర గురువారం తెలిపారు. ఒన్‌బీ, రేషన్ కార్డు, 4 పాస్ ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం వెంట తీసుకురావాలని సూచించారు.

ఏపీఆర్‌ఎస్ పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కన్వీనర్ ప్రసాద్

రామగిరి: పేరూరుడ్యాం, నసనకోటలోని ఏపీఆర్‌ఎస్ గురుకుల (బీసీ బాలుర, బాలికల) పాఠశాలలను జిల్లా కన్వీనర్ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, భోజన, వసతి సౌకర్యాలతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రిన్సిపాళ్లు ఓబులేష్, మునిరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు ఎమ్మెల్యే విరాళం



ఎన్‌పీకుంట: గోపాలపురంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేస్తున్న నాయకులు

ఎన్‌పీకుంట: మండలంలోని గోపాలపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ ఆలయానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి రూ. లక్ష విరాళం అందించినట్లు నాయకులు ఈశ్వర్‌నాయక్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు విరాళం మొత్తాన్ని ఎమ్మెల్యే నాయకులతో ఇచ్చి పంపారని తెలిపారు. గంగిరెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీరాములునాయక్, భాస్కర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

తనకల్లు: రత్నేనాయక్‌తండాలో మారెమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి రూ. 50 వేల విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని మండల వైఎస్సార్ సీపీ నాయకులు కొక్కంటి శ్రీనివాసులునాయుడు, దుశ్యాని నీలకంఠారెడ్డి చేతుల మీదుగా గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేయించారు.

జగనన్నతోనే సొంతింటి కల సాకారం



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఇళ్లు లేని పేదలకు సొంతింటి కల సాకారమవుతోందని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రం కనగానపల్లిలోని జగనన్న కాలనీల్లో వారు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో కనగానపల్లి మండలంలోనే సుమారు 4 వేల మందికి కొత్తగా ఇళ్లు మంజూరు చేయించి, ప్రభుత్వమే వాటిని నిర్మించి ఇస్తోందన్నారు. కనగానపల్లి జగనన్న కాలనీలో ప్రస్తుతం 55 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, దృశ్య కళల డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, నాయకులు నాగముని, అంకె గోపాల్, అశోక్, రమేష్, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, ముత్యాలు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామానికి చెందిన వీరేష్‌బాబుకు చిన్న తనంలోనే పెరాలసిస్ సోకడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఫిబ్రవరి నెలకు పింఛన్ మంజూరైంది. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వలంటీర్ సునీల్ గురువారం పింఛన్ మొత్తం రూ.5 వేలు వీరేష్‌బాబుకు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

39 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



కొలువులు సాధించిన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో సీజీఐ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులు కొలువులు సాధించినట్లు కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి గురువారం తెలిపారు. 2022–23 బ్యాచ్‌కు చెందిన 39 మంది ప్రతిభ కనబరిచి రూ.4.2 లక్షల ప్యాకేజీతో కొలువులు సాధించారన్నారు. అనంతరం నియామకపత్రాలు అందజేశారు. చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మి

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ లక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ మహేష్ అన్నారు. స్థానిక ఆర్డీఓ సమావేశ భవనంలో గురువారం ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించాలన్నారు. ఎత్తు తక్కువగా ఉండే చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం, పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.

సన్మానం

కదిరి టౌన్: కదిరి నియోజకవర్గ బెస్త సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గూళూరు రాజశేఖర్‌ను గురువారం కదిరిలో ఓబీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ముచ్చుకోట్ల గోవర్దన్, సురేంద్ర, వినోద్, కుమార్, విజయేంద్ర పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఉచితంగా వైకుంఠ రథం

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన ఫోర్‌వీలర్ మెకానిక్ కిషోర్ ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని గురువారం ఎస్‌ఐ హేమంత్‌కుమార్ ప్రారంభించారు. అంత్యక్రియల కోసం రథం కావాల్సిన వారు 9985976579 సంప్రదించాలన్నారు.

కార్మికుడికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వరలక్ష్మి థియేటర్ సమీపంలో ఓ ఇంటికి సెంట్రింగ్ పనులు చేస్తూ చిన్నూరు గ్రామానికి చెందిన కార్మికుడు శ్రీనివాసులు గాయపడ్డాడు. అతన్ని అనంతరం ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్: లో ఓల్టేజీ సమస్య నివారణలో భాగంగా పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్ద తండాలో ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతీబాయి స్వంత ఖర్చులతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, లక్ష్మీబాయి, రవి పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగార్జునరెడ్డి

నల్లచెరువు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఓరువాయి గ్రామం మల్లిరెడ్డిపల్లిలో గురువారం డాక్టర్ నాగార్జున రెడ్డి రోగులకు వైద్య సేవలు అందించారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు.

ఆలయ భూములను పరిరక్షించండి

తాడిమర్రి: కునుకుంట్లలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని నార్పల మండలం గంగనపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బిల్లా రాజశేఖర్, తిమ్మనాయుడు, రమణ గురువారం తహసీల్దార్ నాగరాజు, ఎస్‌ఐ లక్ష్మీనారాయణను కలిసి విన్నవించారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

కదిరి అర్బన్: పట్టణంలోని హజరత్ సయ్యద్ హైదర్ షా వలీ(నానా) దర్గా 79వ ఉరుసుమహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గంధం పరికి వంశం నుంచి చాందీని బండిలో బయలుదేరి దర్గా చేరింది. 3న ఉరుసు, 4న జియారత్ ఉంటుందని ఉరుసు ఉత్సవ కమిటీ చైర్మన్ బాషా, కార్యదర్శి ఖాదర్‌బాషా తెలిపారు.

ఎలక్ట్రికల్ వీల్ చైర్స్ పంపిణీ

చెన్నేకొత్తపల్లి: టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన ఐదుగురు విభిన్న ప్రతిభావంతులకు సంస్థ చైర్మన్, 'మేరీ వటమట్టం' గురువారం ఎలక్ట్రికల్ వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈ సంస్థ సిబ్బంది నరసింహులు, జయశ్రీ పాల్గొన్నారు.

5న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 5న యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు వైకే శ్రీనివాస్, కార్యదర్శి సుంకు సుకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం కరపత్రాలు విడుదల చేశారు. కర్నూలుకు చెందిన శ్రీచక్ర ఆస్పత్రి వైద్యులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం

ధర్మవరం: బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ విమర్శించారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బడ్జెట్‌తో పోల్చుకుంటే వ్యవసాయ రంగానికి 12 శాతం కోత విధించారన్నారు. గత ఏడాది ధరల స్థిరీకరణకు రూ.1700 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం కోటి కేటాయించారని తెలిపారు.

చేనేతలకు మొండిచేయి: బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు కేవలం రూ.200 కోట్లు కేటాయించి చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి విమర్శించారు. సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.చేనేత పరిశ్రమకు ఎక్కువ బడ్జెట్ కేటాయించి ప్రోత్సాహం అందిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

కారు ఢీకొని చిన్నారికి గాయాలు

కొత్తచెరువు: కారు ఢీకొని చిన్నారి గాయపడిన ఘటన కొడపగానిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మిద్దె లక్ష్మీనారాయణ కుమార్తె పల్లవి(6) గ్రామంలోని పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం పాఠశాలనుంచి కాలినడకన ఇంటికి వస్తుండగా కొత్తచెరువు నుంచి ధర్మవరం వైపు వెళుతున్న కారు ఢీకొంది తల, కాళ్లకు గాయాలు కావడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.